క్లుప్తంగా

ఉపాధి పనుల ఆకస్మిక తనిఖీ

మల్దకల్: మండలంలోని పాల్వాయిలో ఉపాధి హామీ పనులను డీఆర్‌డీఓ ఉమాదేవి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పనుల వద్ద కూలీలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు. కూలీలకు వేతనాల చెల్లింపులు, సాంకేతిక సమస్యలపై పోస్టల్ సిబ్బందికి అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలోని నర్సరీని వారు పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ శివరామిరెడ్డి, ఎంపీడీఓ కృష్ణయ్య, ఏపీఓ స్వామి, అఖిల్, రాధాకృష్ణ, పంచాయతీ కార్యదర్శి అయ్యప్పరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మండలాలకు చేరిన యూనిఫాం వస్త్రం

గట్టు: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు యూనిఫాంకు సంబంధించిన వస్త్రం బస్తాలు మండలాలకు చేరవేస్తున్నట్లు జిల్లా సమన్వయ అధికారి హంపయ్య తెలిపారు. మంగళవారం మండలానికి 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించిన యూనిఫాం వస్త్రాన్ని ఎంఈఓ కార్యాలయంలో ఆయన అప్పగించారు. జిల్లాలోని 461 పాఠశాలల్లో చదువుకుంటున్న 67529 మంది విద్యార్థులకు 3,33,060.60 మీటర్ల యూనిఫాం వస్త్రం జిల్లాకు వచ్చిందని, వీటిని ఆయా మండలాలకు అందజేయడం జరుగుతుందని హంపయ్య తెలిపారు.

ఆర్థికసాయం అందజేత



ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని శనిగపల్లి గ్రామానికి చెందిన హెచ్. సుధాకర్ గుండెపోటుతో ఇటీవల మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోతురాజు శంకరమ్మ సేవాదళం సభ్యులు మంగళవారం గ్రామానికి చేరుకొని కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అనంతరం మృతురాలి కుటుంబ సభ్యులకు రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో సేవాదళం సభ్యులు, గ్రామస్తులు ఉన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ



ధరూరు: మండలంలోని ర్యాలంపాడు యూపీఎస్ పాఠశాలలో చదువుతూ గురుకుల ప్రవేశాల కోసం ప్రిపేర్ అవుతున్న 22 మంది విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన చార్టెడ్ అకౌంటెంట్ రాఘవేంద్రారెడ్డి సొంత ఖర్చులతో విద్యార్థులకు మెటీరియల్‌ను అందించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సంధ్యారాణి, పురుషోత్తంరెడ్డి, భాస్కర్, రవీందర్‌రెడ్డి, వీరస్వామి, రంగన్న, ఉపాధ్యాయులు శరణప్ప, సుజాత తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాధికారం దిశగా ముందుకు ..



ధరూరు: తరాలుగా వెనుకబాటుకు గురైన బహుజనులు అన్ని రంగాల్లో ఎదగాలని, వారిని చైతన్యం చేస్తూ రాజ్యాధికారం దిశగా ముందుకు సాగుతున్నట్లు నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా చైర్మన్ గొంగళ్ల రంజిత్ కుమార్ అన్నారు. ఐదో రోజు మంగళవారం ఆత్మగౌరవ పాదయాత్ర మండలంలోని నీలహళ్లి, నెట్టెంపాడు, నాగర్‌దొడ్డి, ద్యాగదొడ్డి, ఉప్పేరు గ్రామాల మీదుగా సాగింది. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ బుచ్చిబాబు, కార్యదర్శి లవన్న, నాయకులు గోవిందు, ఏసు, మునెప్ప, వీరేష్, రంగస్వామి, భీమేష్ గౌడ్, రాము, ఎల్లేష్, నాగేష్, విష్ణు, ప్రేమ్‌రాజ్, రంగప్ప, తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు.

షడ్రుచుల పండుగ

- జిల్లావ్యాప్తంగా ఉగాదికి ఘన ఏర్పాట్లు
- ఆలయాల్లో పంచాంగ శ్రవణాలు, కవి సమ్మేళనాలు



ఇటిక్యాల మండలంలోని ఎర్రవల్లి చౌరస్తాలో..



జిల్లా కేంద్రంలో బంతిపూలు కొనుగోలు చేస్తున్న ప్రజలు

గద్వాల: సంస్కృతీ సంప్రదాయాల్లో కాలానికి ఒక ప్రమాణం ఉంది. కాలాన్ని లెక్కించడానికి నిర్దిష్ట ప్రమాణాలున్నాయి. ఇందులో భాగంగానే నెలలు, సంవత్సరాలకు పేర్లను నిర్దేశించారు. చైత్రం నుంచి ప్రారంభమయ్యే నెలలు ఫాల్గుణంతో ముగుస్తాయి. కొత్త పూత, కాత, రుచులతో నూతన సంవత్సరం ఆరంభమవుతూ కొంగొత్త ఆలోచనలకు తెరతీస్తుంది.

తెలుగుజాతికి ప్రత్యేకం ఉగాది..

ఉగాది పర్వదినం తెలుగుజాతికి మాత్రమే ప్రత్యేకం. ఉగాది రోజున షడ్రుచుల పచ్చడి సేవిస్తారు. పచ్చడిలో పులుపు (ఆమ్లం), తీపి (మధురం), వగరు (కషాయం), చేదు (పిత్తం), కారం (కటువు), ఉప్పు (లవణం) గుణాలతో కూడిన వేప పువ్వు, లేత మామిడికాయ, బెల్లం, చింతపండు, ఉప్పు, కారంతో ఉగాది పచ్చడి తయారు చేస్తారు.

పంచాంగ శ్రవణం..

ఉగాది రోజున సాయంత్రం ఆలయాలు, గ్రామ కూడళ్లలో పంచాంగం శ్రవణం నిర్వహిస్తుంటారు. పురోహితుడు గ్రామపెద్దల సమక్షంలో ఆదాయ, వ్యయాలు, వర్షాలు, కరవు కాటకాలు, అరిష్టాల గురించి వివరిస్తారు. తిథి, వార, నక్షత్ర, యోగ, కరణం అనే అయిదు అంశాలతో కూడిన పంచాంగ శ్రవణం వింటే సంపద, ఆయుష్షు, పాప పరిహారం, రోగాలు తొలగడం, చేసే ప్రయత్నాలు ఫలించడం వంటి అయిదు ప్రయోజనాలు చేకూరుతాయని చెబుతారు.

గ్రామాల్లో ఉగాది సందడి..

జిల్లావ్యాప్తంగా మంగళవారం ఉగాది సందడి కనిపించింది. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు జిల్లాకేంద్రంలోని పాతబస్టాండ్, రథశాల, కూరగాయల మార్కెట్, గాంధీచౌక్ తదితర ప్రాంతాల్లోని దుకాణాల్లో పండుగ సామగ్రి కొనుగోలు చేస్తుండటంతో రద్దీ కనిపించింది. మామిడి కాయలు, పచ్చి ఇస్తారాకులు, పూలు, పూజా సామగ్రికి డిమాండ్ నెలకొంది. పూలు, పండ్లు, కూరగాయల ధరలు కొండెక్కి కూర్చున్నా కొనుగోలుదారులు ఏ మాత్రం రాజీ పడలేదు. మామిడి తోరణాలు పెద్దమొత్తంలో తీసుకొచ్చి అమ్మకాలు జరిపారు. పండుగను పురస్కరించుకొని పలు ప్రాంతాల్లో బండలాగుడు పోటీలు నిర్వహించడానికి రైతులు ఏర్పాట్లు చేశారు. ముఖ్యంగా జిల్లాకేంద్రంలోని సుంకులమ్మ, ఈదమ్మ ఆలయాల వద్ద భక్తులు కోళ్లను బలిచ్చి నైవేద్యాలు సమర్పిస్తారు. అందుకుగాను ఆలయ నిర్వాహకులు, పోలీసులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

కవి సమ్మేళనాలు..

'హితేన సహితం సాహిత్యం' అంటే మేలు చేసేదే సాహిత్యం అని అర్థం. కవి సమ్మేళనాల్లో ఔత్సాహిక కవులు జనహితం కోరుతూ రచించిన కవితలను షడ్రుచులతో పాటు మాతృభాష మాధుర్యాన్ని జోడించి చదివి వినిపిస్తారు. ఇలాంటి కవి సమ్మేళనాలకు చిన్నారులను తీసుకెళ్లడంతో మాతృభాషపై మరింత అవగాహన పెరిగే వీలుంటుంది. కవిత, రచన ప్రక్రియపై అవగాహన పెరుగుతుంది. ఇతర భాషల మోజులో ఉన్న వారికి సైతం మాతృభాషపై ఆసక్తి కలుగుతుంది. కవితల రూపంలో తెలుగు సంస్కృతీ సంప్రదాయాలను ముందుతరానికి పరిచయం చేయవచ్చు.

పాఠశాలల్లో ముందస్తు ఉగాది వేడుకలు

గద్వాల: పట్టణంలోని పలు ప్రైవేటు పాఠశాలల్లో ముందస్తు ఉగాది వేడుకలను నిర్వహించారు. మంగళవారం స్థానిక ఎస్ఆర్ విద్యానికేతన్, విశ్వభారతి, కాకతీయ టెక్నోస్కూల్, ప్రగతి విద్యానికేతన్, మాంటిస్సోరి, విశిష్ట నోబుల్ స్కూల్ తదితర పాఠశాలల్లో విద్యార్థులు శుభకృత్‌నామ సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ శోభకృత్ నామ సంవత్సరానికి స్వాగతం పలికారు. విద్యార్థులు పంచాంగ శ్రవణాన్ని నిర్వహించారు. సంప్రదాయ బద్ధంగా అరటి బోదెలు, మామిడి తోరణాలు, ఉగాది పచ్చళ్లు విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆయా పాఠశాలల కరస్పాండెంట్లు, ప్రిన్సిపాల్స్ తదితరులు పాల్గొన్నారు.

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని ఎర్రవల్లి చౌరస్తాలో ఉగాది పండగను పురస్కరించుకొని మంగళవారం వివిధ దుకాణాలు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. ఈ సందర్భంగా పండగను పురస్కరించుకొని కూడళ్లు రద్దీగా మారాయి.

ప్రారంభమైన ఉగాది ఉత్సవాలు

అయిజ: మండలంలోని చిన్న తాండ్రపాడులో ఉగాది పండుగ సందర్భంగా మంగళవారం సత్యమాంభ ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా ఆలయంలో అమ్మవారికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి ప్రభోత్సవం కనుల పండువగా నిర్వహించారు. అదేవిధంగా తెలుగు రాష్ట్రాల స్థాయి భజన పోటీలు ఏర్పాటు చేశారు.



ఎస్ఆర్ విద్యానికేతన్‌లో ఉగాది వేడుకలు నిర్వహిస్తున్న విద్యార్థులు

మన ఊరు మన బడి పనుల పరిశీలన



విద్యార్థులతో మాట్లాడుతున్న విజయనాయక్

అలంపూర్ రూరల్: మండలంలోని కాశీపూర్‌లో మన ఊరు–మన బడిలో భాగంగా చేస్తున్న పనులను మంగళవారం జెడ్పీ సీఈఓ విజయనాయక్ పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు సూచనలు, సలహాలను ఇచ్చారు. తరగతి గదులను పరిశీలించారు. మధ్యాహ్న భోజనం తనిఖీ చేశారు. గ్రామంలో నర్సరీని సందర్శించారు. అలాగే ఈజీఎస్ నూతన పనులను ఎంపిక చేసి కూలీలను పెంచే విధంగా చూడాలన్నారు. సీఈఓ వెంట ఎంపీడీఓ నాగశేషాద్రి సూరి, ఉపాధ్యాయులు, ఎస్ఎంసీ చైర్మన్ తదితరులు ఉన్నారు.

సకాలంలో పూర్తి చేయాలి



అయిజ: పట్టణంలో చేపట్టిన అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య కాంట్రాక్టర్లను ఆదేశించారు. మంగళవారం పట్టణంలోని మాధవ థియేటర్ ఎదుట సీసీ రోడ్డు నిర్మాణం పనులను, కొత్త బస్టాండ్‌లో చేపట్టిన సెంటర్ లైటింగ్ పిల్లర్స్ నిర్మాణం పనులను మున్సిపల్ కమిషనర్‌తో పాటు మున్సిపల్ చైర్మన్ చిన్న దేవన్న, వైస్ చైర్మన్ మాల నరసింహులు, ఏఈ గోపాల్ పరిశీలించారు. కార్యక్రమంలో ఎండీ మహబూబ్ పాషా, ఆంజనేయులు వివిధ వార్డుల కౌన్సిలర్లు పాల్గొన్నారు.

రైతుల నిర్బంధం తగదు

గద్వాల అర్బన్: చిన్నోనిపల్లి భూ నిర్వాసిత రైతులను అక్రమంగా అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్ల చుట్టు తిప్పుతూ నాలుగు రోజులుగా నిర్బంధించడం పోలీసులకు, ప్రభుత్వానికి తగదని అఖిల పక్ష, ప్రజాసంఘాల నాయకులు అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీవో భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. రాయలసీమకు ఉపయోగపడే ఈ రిజర్వాయర్ నిర్మించడం సిగ్గుచేటన్నారు. ఆర్డీఎస్ నుంచి తెలంగాణ రావాల్సిన వాటాపై మాట్లాడకపోవడం దుర్మార్గమన్నారు. వెంటనే చిన్నోనిపల్లి రిజర్వాయర్ పనులను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో అఖిలపక్షం నాయకులు సీపీఐ జిల్లా కార్యదర్శి ఆంజనేయులు, సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకటస్వామి, టీజేఎస్ జిల్లా కన్వీనర్ ఆలూరు ప్రకాశ్ గౌడ్, పాలమూరు అధ్యయన వేదిక కన్వీనర్ ఇక్బాల్ పాషా, జేఏసీ నాయకులు మధుసూదన్ బాబు, సుభాన్, వినోద్, వాల్మీకి, నర్సింహ్మ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వెంకటస్వామి

24న వాహనాల వేలం

అలంపూర్: ఈ నెల 24వ తేదీన పట్టుబడిన వాహనాల వేలం పాట నిర్వహిస్తున్నట్లు అలంపూర్ ఎక్సైజ్ సీఐ హన్మనాయక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒక ద్విచక్ర వాహనం, రెండు త్రీ చక్రవాహనాలను పట్టణంలోని సీఐ కార్యాలయం ఆవరణలో వేలం పాట నిర్వహిస్తునట్లు పేర్కొన్నారు. వేలంపాటలో పాల్గొనే వారు రూ.5 వేల డిపాజిట్ చేయాలని తెలిపారు.

అధునాతన మరుగుదొడ్లు ప్రారంభం

గట్టు: తమిళనాడుకు చెందిన ఎల్‌బీసీ, గ్రామాల స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పెంచికలపాడు, ఆరగిద్ద గ్రామాల్లో ఆధునిక మరుగుదొడ్లను నిర్మించారు. ఒక్కొక్క పాఠశాలలో రూ.3.35 లక్షల వ్యయంలో నిర్మించిన మరుగుదొడ్లను మంగళవారం పెంచికలపాడులో ఉప సర్పంచు ఆంజనేయులు, ఎస్ఎంసీ చైర్మన్ శివప్ప, ఆరగిద్దలో పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశ్వర్లు ప్రారంభించారు. ఆయా గ్రామాల పెద్దలు, పాఠశాల ఉపాధ్యాయుల సమక్షంలో వీటిని పాఠశాలలకు అప్పగించారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ నర్సింహులు, మధుసూదన్‌రెడ్డి కార్యదర్శి శ్రీశైలం, గ్రామాలయ స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ పాపు, జిల్లా ఎడ్యుకేషన్ డైరెక్టర్ ప్రాణేశ్వర్‌రెడ్డి, హెడ్మాస్టర్ మధుసూదన్‌భట్, విజయ్‌సింహాచారి, ఆంజనేయులు, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు హాలీంపాషా పాల్గొన్నారు.



మరుగుదొడ్డిని ప్రారంభిస్తున్న సంస్థ ప్రతినిధులు

ఇంటర్ పరీక్షలకు 184 మంది గైర్హాజరు



గద్వాల: ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రశాంత వాతావరణంలో కొనసాగుతున్నాయి. శనివారం జిల్లా వ్యాప్తంగా 13 పరీక్ష కేంద్రాలలో మ్యాథ్స్, బాటనీ, పొలిటికల్ సైన్స్ పరీక్షకు మొత్తం 4,050 మంది విద్యార్థులకు 3,866 మంది విద్యార్థులు హాజరయ్యారు. 184 మంది గైర్హాజరయ్యారు. ఇంటర్ జనరల్ విభాగంలో 3,440 మంది విద్యార్థులకు 3,288 మంది హాజరు కాగా, ఒకేషనల్ విభాగంలో 610 మంది విద్యార్థులకు 578 మంది హాజరయ్యారు. అలంపూర్ పరీక్ష కేంద్రాన్ని ఇంటర్ విద్యా జిల్లా అధికారి హృదయరాజు తనిఖీ చేశారు.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి



మద్దెలబండ కంటి పరీక్షలను పరిశీలిస్తున్న వైస్ ఎంపీపీ పెద్దవీరన్న

మల్దకల్: మండలంలోని మద్దెలబండలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కేంద్రాన్ని మంగళవారం వైస్ ఎంపీపీ పెద్దవీరన్న, ఎంపీడీఓ కృష్ణయ్య, సర్పంచు జయమ్మలు ప్రారంభించారు. కంటి పరీక్షల కోసం వచ్చే ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని వైద్య సిబ్బందికి వారు సూచించారు. కార్యక్రమంలో నారాయణ, డాక్టర్లు నవీన్‌కుమార్, స్వరూపరాణి, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ చల్లాకు సన్మానం

శాంతినగర్: మండలంలోని తనగలలో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనానికి మంగళవారం ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి హాజరయ్యారు. ఈసందర్భంగా నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్సీని సన్మానించారు. పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో పుల్లూరు నాగేశ్వర్‌రెడ్డి, పరమేశ్వర్‌రెడ్డి, రంగారెడ్డి, ఆంజనేయులుగౌడ్, మధుసూదన్‌రెడ్డి, సర్వేశ్వర్‌రెడ్డి, మానవపాడు ఎంపీపీ అశోక్‌రెడ్డి, కార్యకర్తలు,పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం

మల్దకల్: గర్భిణీ, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని సీడీపీఓ కమలాదేవి సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని 2, 3 అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా అంగన్‌వాడీ కేంద్రాలలో రికార్డులను పరిశీలించారు. పోషణ పక్షంలో భాగంగా చిరుధాన్యాల వంటకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు లక్ష్మీరంగమ్మ, మహేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అండగా ఉంటాం



మాట్లాడుతున్న డీకే అరుణ

గట్టు: చిన్నోనిపల్లె నిర్వాసిత కుటుంబాలు ధైర్యంగా ఉండాలని బీజేపీ జాతీయ అధ్యక్షురాలు డీకే అరుణ సూచించారు. మంగళవారం ఆమె కార్యకర్తలతో కలసి చిన్నోనిపల్లెను సందర్శించారు. అంతకుముందు డీకే అరుణ కాన్వాయ్‌ను సీఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో అడ్డుకున్నారు. కాసేపు ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. జిల్లా ఎస్పీతో మాట్లాడిన తర్వాత కాన్వాయ్‌ను అనుమతించారు. రిజర్వాయర్ పనులను పరిశీలించి ఇంజనీరింగ్ అధికారులతో చర్చించారు. అనంతరం గ్రామస్తులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం తోటపల్లి రిజర్వాయర్‌ను రద్దు చేసిన విధంగా చిన్నోనిపల్లె రిజర్వాయర్‌ను కూడా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రిజర్వాయర్ రద్దు కోసం ఆనాడే డీకే భరతసింహారెడ్డి జైలుకెళ్లారని గుర్తుచేశారు. పండుగ పూట రైతులను పోలీసులు ఇబ్బందిపెట్టడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాంచంద్రారెడ్డి, కార్యవర్గ సభ్యుడు గద్దం కృష్ణారెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ రామాంజనేయులు, పట్టణ అధ్యక్షుడు బండల వెంకట్రాములు, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కబీర్‌దాస్ నర్సింహులు, మండల అధ్యక్షుడు బల్గెర శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డీకే అరుణ పొలిటికల్ టూరిస్టు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాలరూరల్: డీకే అరుణ పొలిటికల్ టూరిస్టు అని చిన్నోనిపల్లె గురించి ఆమె మాట్లాడుతుంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్లుందని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి విమర్శించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 92 శాతం పూర్తైన రిజర్వాయర్‌ను పర్సంటేజీల పనులు ఆపిన ఘనత మీ ప్రభుత్వానికి కాదా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో స్టేట్ కన్జ్యూమర్ ఫెడరేషన్ కార్పొరేషన్ చైర్మన్ గట్టు తిమ్మప్ప, జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్ జంబు రామన్‌గౌడ్, గట్టు ఎంపీపీ విజయ్‌కుమార్, రమేష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ధరూరు: మండలంలోని నెట్టెంపాడు గ్రామానికి చెందిన బోయ శివప్ప ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వం తీసుకోవడంతో రూ.2లక్షల ప్రమాద బీమా మంజూరు అయ్యింది. దీంతో మంగళవారం ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి బాధిత కుటుంబసభ్యులకు చెక్కును అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, మండల అధ్యక్షుడు డీఆర్ విజయ్‌కుమార్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ధరూరు: మండలంలోని నెట్టెంపాడులో నిర్మిస్తున్న మల్టీ పర్పస్ ఫంక్షన్‌హాల్ నిర్మాణ పనులను మంగళవారం ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి పరిశీలించారు. కార్యక్రమంలో కేటీదొడ్డి జెడ్పీటీసీ రాజశేఖర్, వైస్ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి,, డీఆర్ విజయ్ కుమార్, నాయకులు వెంకట్రామిరెడ్డి, బషీర్, భీంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో అమావాస్య పూజలు



ఆదిశిలా క్షేత్రంలో ..

గట్టు: అమావాస్య సందర్భంగా మంగళవారం మండల కేంద్రంలోని గండి ఆంజనేయస్వామి ఆలయంలో స్వామి వారికి పంచామృత అభిషేకం, మాచర్లలోని చెన్నకేశవస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు.

ధరూరు/కేటీదొడ్డి: ధరూరు, కేటీదొడ్డి మండలాలలోని వివిధ ఆలయాలలో అమావాస్య పూజలు నిర్వహించారు. మండల కేంద్రంతో పెద్ద చింతరేవుల ఆంజనేయ స్వామి, కోతులగిద్ద అరణేశ్వర స్వామి, అల్వలపాడులోని తెలుగోనిపల్లి ఆంజనేయ స్వామి, పాగుంట వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆయా ఆలయాలలో భక్తులకు అన్నదానం చేశారు.

ఉండవెల్లి: మండలంలోని డీ.బూడిదపాడు ఆంజనేయ స్వామి ఆలయంలో ఆంజనేయ స్వామికి ఆకు పూజలు నిర్వహించారు. బైరాపురం, అలంపూర్ చౌరస్తాలోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

మల్దకల్: ఆదిశిలా క్షేత్రమైన స్వయంభూ లక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులు అమావాస్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. సద్దలోనిపల్లి కృష్ణస్వామి, పాల్వాయి అడవి ఆంజనేయస్వామి, కుర్తి రావులచెర్వు గట్టుతిమ్మప్పస్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. గద్వాల పట్టణంలోని కాకతీయ టెక్నోస్కూల్ ఆధ్వర్యంలో ఆదిశిలా క్షేత్రంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు, ఈఓసత్యచంద్రారెడ్డి, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

ఎర్రవల్లిచౌరస్తా: బీచుపల్లి పుణ్యక్షేత్రంలో అమావాస్యను పురస్కరించుకొని అభయాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పవిత్ర కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం శివాలయం, కోదండరామస్వామి, సరస్వతీదేవితో పాటు అభయాంజనేయస్వామి ఆలయాలను దర్శించుకున్నారు. భక్తులకు అన్నదానం చేశారు.

జన చైతన్య యాత్రను విజయవంతం చేద్దాం



అలంపూర్ చౌరస్తాలో పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

అలంపూర్: జనచైతన్య యాత్రను విజయవంతం చేద్దామని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు రాజు కోరారు. మంగళవారం పట్టణంలోని కేవీపీఎస్ కార్యాలయంలో జన చైతన్య యాత్రకు సంబంధించిన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతుందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ వైఖరిని ప్రజలకు వివరించేందుకు ఈ నెల 27వ తేదీన గద్వాల జిల్లా కేంద్రంలో బహిరంగ సభ నిర్వహిస్తునట్లు పేర్కొన్నారు. అదేవిధంగా పట్టణంలోని జాతీయ రహదారి నాలుగు రోడ్ల కూడలిలో జన చైతన్య యాత్ర పోస్టర్‌ను సీపీఎం నాయకులు విడుదల చేశారు. పట్టణంలో ఈ నెల 24వ తేదీ నుంచి 29వ తేదీ వరకు జన చైతన్య యాత్రలు కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి నరసింహ్మ, నాగరాజు, వెంకటస్వామి, అయ్యప్ప, ఏలీయా, సిద్దు, జీకే ఈదన్న, వెంకటేశ్వర్లు, మద్దిలేటి, మాదన్న, ఆబ్బాస్, ఆనంద్, రసూల్, రమేష్, బాష, రంగన్న, రాముడు పాల్గొన్నారు.

గట్టు: సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో చేపట్టే జన చైతన్య బస్సు యాత్రను విజయవంతం చేయాలని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి వీవీ నర్సింహా కోరారు. మంగళవారం మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో యాత్రకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. బీజేపీ మతోన్మాద విధానాలను వ్యతిరేకిస్తూ సంక్షేమం, మత సామరస్యం, సామాజిక న్యాయం కోసం బస్సు యాత్రను చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో నర్మద, ఆంజనేయులు, ఉరుకుందు, చంద్రు, బలరాముడు, వెంకటేష్, స్వామి, నర్సింహులు, నాగేష్, వెంకటేష్, పాల్గొన్నారు.

గద్వాల అర్బన్: సీపీఎం ఆధ్వర్యంలో చేపడుతున్న జనచైతన్య యాత్రను విజయవంతం చేయాలని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి వెంకటస్వామి కోరారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని పాతబస్టాండులో వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. ఈనెల 27న జన చైతన్య యాత్ర జిల్లా కేంద్రానికి చేరుకుంటుందని అదే రోజు సాయంత్రం 5 గంటలకు బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వీవీ నర్సింహ్మా, ఉప్పేరు నర్సింహ్మా, మల్లేష్, వెంకటేష్, రాజేష్‌లు ఉన్నారు.

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

గద్వాల అర్బన్: విద్యుత్ ఉద్యోగులకు వేతన సవరణ, ఈపీఎఫ్, తదితర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 24న హైదరాబాద్‌లోని విద్యుత్ సౌధ కార్యాలయం ముందు ధర్నా చేపట్టనున్నట్లు జేఏసీ చైర్మన్ రామకృష్ణ, కో చైర్మన్ అశోక్ తెలిపారు. మంగళవారం ఈ ధర్నాకు సంబంధించిన పోస్టర్‌ను విద్యుత్ శాఖ కార్యాలయంలో విద్యుత్ శాఖ ఎస్ఈ భాస్కర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు శ్రీనివాసులు, నర్సింహ్మా, మురళీ, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్.ఈ భాస్కర్